క్లుప్తంగా

పొగాకు ఉత్పత్తుల వాడకం ఆరోగ్యానికి హానికరం



జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రదర్శన

వెలుగోడు: పొగాకు ఉత్పత్తుల వాడకం ఆరోగ్యానికి హానికరమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పొగాకు ఉత్పత్తుల నిషేధంపై అవగాహన కల్పించారు. బీడీ, చుట్టా, సిగరేట్, జరదా, తంబాకు, పాన్‌మసాలా వంటి వాటిని ఉపయోగించడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. పొగాకు వాడడం వల్ల హైపర్ టెన్షన్, నోటి క్యాన్సర్, శ్వాసకోస, గుండె సంబంధిత వ్యాధులు సంక్రమించే అవకాశముందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిశంకర్, సుబ్రహ్మణ్యం, సుబ్బయ్య, నాగవాణి, మొయిద్దీన్, సురేందర్ సింగ్, ఫైజుల పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి



కార్మికులతో మాట్లాడుతున్న రమేష్‌బాబు

పాములపాడు: జగనన్న గోరుముద్ద పథకం కార్మికుల వేతనాలు పెంచాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న కార్మికులను శుక్రవారం ఆయన కలిసి మాట్లాడారు. ఈ పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 25న రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని కార్మికులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటరమణ, జయమ్మ, లక్ష్మీదేవి, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై నోటీసులు జారీ చేయండి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఈఓఆర్డీ

మిడుతూరు: మండల కేంద్రంలోని మూడు అక్రమ లేఅవుట్లపై కుడా వైస్‌చైర్మన్ జారీ చేసిన ఫైనల్ నోటీసులను సంబంధీకులకు జారీ చేయాలని ఈఓఆర్డీ ఫక్రుద్దీన్ ఆదేశించారు. శుక్రవారం సచివాలయం-1ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సుధీర్‌కు సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలించారు.

అలరించిన నృత్యప్రదర్శన



నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నానికి చెందిన కళారాధన ఆర్ట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ వారిచే నిర్వహించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. కార్యక్రమంలో తాండవ నృత్యకరే, శివతాండవ స్తోత్రం, తాండవ నృత్యం, అఖిలాండేశ్వరి, శంభో శివశంభో తదితర గీతాలకు భానుప్రణవి, చందన, యామిని, రమ్య, తులసి, వినీల, మనస్విని, మోక్ష తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

గోస్పాడు: తేళ్లపురి-నంద్యాల రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పేమ్‌కుమార్ (23) మృతి చెందినట్లు ఎస్ఐ మల్లికార్జున శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి బనగానపల్లె నుంచి నంద్యాలకు బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి తేళ్లపురి సమీపంలో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

26న జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు

నంద్యాల(సెంట్రల్): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈనెల 26వ తేదీన స్థానిక పద్మావతినగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఇండోర్ స్టేడియంలో ఉదయం 10గంటలకు విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని జిల్లా పర్యాటక-సాంస్కృతిక శాఖాధికారి సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చూపిన తొలి ముగ్గురికి వారికి ఈనెల 27న కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు నూనెపల్లెలోని జిల్లా పర్యాటక శాఖాధికారి కార్యాలయంలో గానీ, 7995087089, 9966028028, 8297098022 సంప్రదించాలని సూచించారు.



నిమజ్జనం వేడుకలను తిలకిస్తున్న భక్తులు

కేసీ కాల్వలో 90 విగ్రహాల నిమజ్జనం

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా, తూడిచెర్ల, పోతులపాడు గ్రామాలతో పాటు నందికొట్కూరు పట్టణంలో నెలకొల్పిన మొత్తం 90 వినాయక విగ్రహాలను జూపాడుబంగ్లా వద్ద కేసీ కాల్వలో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆత్మకూరు డీఎస్పీ వెంకట్రావు ఆధ్వర్యంలో ఎస్ఐ మారుతీశంకర్, పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ నిమజ్జనం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. నిమజ్జన ప్రాంతం కేసీ కాల్వ వంతెన వద్ద విద్యుద్దీపాలతో అలంకరించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. కేసీ కాల్వలో నాటు పడవలతో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. నిమజ్జనం వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున కేసీ కాల్వ వద్దకు చేరుకున్నారు.



కేసీ కాల్వలో నిమజ్జనం కోసం బారులు తీరిన గణనాథుల ప్రతిమలు

వినాయకా.. వీడ్కోలిక!

అంగరంగ వైభవంగా గణేష్ నిమజ్జనం



పటేల్ సెంటర్‌లో వైద్యశాఖ ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మందులు తీసుకుంటున్న భక్తుడు



భక్తులకు తాగునీరు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది



కేసీ కాల్వలో నిమజ్జనమవుతున్న వినాయకుడు



భక్తుల సంబరాల మధ్య నిమజ్జనానికి తరలుతున్న ఫర్టిలైజర్స్ యూనియన్ గణేశుడు

నందికొట్కూరు: గణేష్ నిమజ్జన వేడుకలను భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. పట్టణంలో కొలువుదీరిన 67 వినాయక విగ్రహాలు ఐదు రోజుల పాటు పూజలందుకుని శుక్రవారం జూపాడు బంగ్లా మండల కేంద్రంలోని కేసీ కెనాల్ వద్దకు నిమజ్జనానికి తరలివెళ్లాయి. 'గణపతి మొప్పా.. మోరియా, ఉండ్రాలయ్యా.. ఉంటామయ్యా, జై గణేశా.. జైజై గణేశా' నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. మేళతాళాలు, యువకుల కేరింతలు, నృత్యాల మధ్య గణనాథులు ఊరేగింపు సంబరం అంబరాన్నంటింది. పలువురి వేషధారణలు ఆకట్టుకున్నాయి. కొందరు రంగులు చల్లుకొని సంబరాలు జరుపుకున్నారు. ఉత్సవాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వినాయకుడి దయతో రాయలసీమ ప్రాంతం పచ్చగా ఉందన్నారు. వర్షాలు సకాలంలో కురవడంతో రైతన్నలు, ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. భక్తులకు మున్సిపల్ చైర్మన్, కమిషనర్ కిషోర్ వాటరు, లైటింగ్, వేదిక ఉచితంగా సరఫరా చేశారు. రూరల్ సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎన్వీ రమణ భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు రంగారెడ్డి, ఫర్టిలైజర్స్ యూనియన్ నాయుడు, బంగారు వ్యాపారుల అసోసియేషన్ నాయకుడు శేఖర్, ఎస్ఐలు జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో..



నిమజ్జనానికి బయలుదేరిన వినాయకుని ప్రతిమ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలో శుక్రవారం గణేష్ నిమజ్జనం వైభవంగా జరిగింది. సున్నిపెంటలో ఏర్పాటు చేసిన 35 గణేష్ విగ్రహాలను పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. నృత్యాలు, వాయిద్యాలమధ్య వినాయకుని ప్రతిమలను డ్యాం దిగువ భాగంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

మహానంది మండలంలో..

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంతో పాటు మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం వినాయక నిమజ్జన వేడుకలు వైభవంగా జరిగాయి. అంతకుముందు వినాయక విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన లడ్డూలను పలువురు వేలంపాటలో దక్కించుకున్నారు.



గణేశుడికి పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, సీఐ విజయభాస్కర్



నిమజ్జనం వేడుకలను పర్యవేక్షిస్తున్న ఆత్మకూరు డీఎస్పీ వెంకట్రావు, ఎస్ఐ మారుతీశంకర్



నిమజ్జనానికి తరలివెళ్తున్న హాజీనగర్ వినాయకుడి ముందు సంబరాలు చేసుకుంటున్న భక్తులు



తిమ్మాపురంలో నిమజ్జనానికి వెళ్తున్న వినాయకులు

దుద్యాల విద్యార్థుల ప్రతిభ

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం మంగన్న తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులతో కలిసి ఆయన అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈనెల 20, 21 తేదీలలో నందికొట్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీలలో అండర్ -14 బాలుర విభాగంలో తమ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. అలాగే అథ్లెటిక్స్‌లోనూ తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమోహన్, శంకర్, వెంకటేశ్వర్లు, వసుంధర పాల్గొన్నారు.



జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయ బృందం

లోయలో నుంచి ట్యాంకర్ వెలికితీత



ట్యాంకర్‌ను క్రేన్లతో తీస్తున్న దృశ్యం

మహానంది: నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ట్యాంకర్ లోయలో పడిన విషయం తెలిసిందే. ఈ నెల 16న నిడదవోలు నుంచి నంద్యాల వైపు వస్తున్న కూల్‌డ్రింక్స్ స్పిరిట్ ట్యాంకర్.. బైకు, కారును ఢీకొని లోయలో పడింది. వారం రోజుల తర్వాత శుక్రవారం మూడు భారీ క్రేన్ల సాయంతో లోయలో నుంచి ట్యాంకర్‌ను బయటికి తీశారు. ఈక్రమంలో ఘాట్‌రోడ్డులో కొన్ని గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రమాదకర మలుపుల వద్ద నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతుందని, ఆర్అండ్‌బీ, పోలీసుశాఖ అధికారులు స్పందించి ముందు జాగ్రత్తల్లో భాగంగా ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ఆత్మకూరు: సౌత్ ఇండియా ఐకాన్ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రగతి హైస్కూల్ హెచ్ఎం రామారావును శుక్రవారం ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ప్రగతి హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కరెస్పాండెంట్ శకుంతల మాట్లాడుతూ బోధన పట్ల అంకిత భావం కలిగిన ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులన్నారు. అవార్డు గ్రహీత రామారావు విద్యార్థులను తీర్చిదిద్దడంలో విశేషంగా కృషిచేశారని కొనియాడారు. అనంతరం దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు.

ఒంటరి మహిళపై లైంగికదాడికి యత్నం

కొత్తపల్లి: ఒంటరి మహిళపై ఓ వ్యక్తి లైంగిక దాడికి యత్నించాడు. ఈ ఘటన మండలంలోని ఎదురుపాడు గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఒంటరి మహిళ రాత్రి గాఢ నిద్రలో ఉండగా అదే గ్రామానికి చెందిన దిబ్బన్న ఇంట్లోకి ప్రవేశించాడు. మహిళపై లైంగిక దాడికి యత్నించగా ఆమె కేకలు వేయడంతో పరారయ్యాడు. శుక్రవారం ఉదయం బాధితురాలు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రజలకు ఆరోగ్య పరీక్షలు

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో శుక్రవారం వైద్యసిబ్బంది గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ శాతం, షుగర్, బీపీ, మలేరియా, డెంగీ, టీబీ నిర్ధారణకు గల్ల పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న 25 మందికి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో స్పెషలిస్టు డాక్టర్ల చేత వైద్యం చేయించుకునేందుకు టోకన్లు ఇచ్చారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బాలకృష్ణ, ఏఎన్ఎం సరిత, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



గర్భిణికి బీపీ చెక్ చేస్తున్న వైద్యసిబ్బంది

ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి

పగిడ్యాల: త్వరలో ప్రారంభమయ్యే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండల ఆఫీసర్ బాలయ్య, తహసీల్దార్ భారతీ, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్నతో కలిసి వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లతో సమావేశమయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆరోగ్యవంతంగా ఉండాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మెడికల్ క్యాంప్ నిర్వహణ కంటే 15 రోజులు ముందు వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి రక్తనమూనాలు సేకరించి వ్యాధులను నిర్ధారించి టోకన్లు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో సచివాలయాల మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి పాల్గొన్నారు.

హాకీ, బేస్‌బాల్ పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీ క్రీడా మైదానంలో స్కూల్‌గేమ్స్ అండర్-19 బాలబాలికల హాకీ బేస్‌బాల్ ఉమ్మడి జిల్లాల ఎంపిక పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి పద్మావతి, ఎస్పీ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. బేస్‌బాల్ కార్యదర్శి సుబ్బయ్య, కర్నూలు జిల్లా ఫెన్సింగ్ కోచ్ మహేశ్వరరావు, హాకీ కోచ్ సుదర్శన్, దస్తగిరిరెడ్డి, షేక్షావలిరెడ్డి క్రీడాకారులకు వసతి కల్పించారు.

రక్తదానంతో ప్రాణదానం

ఆత్మకూరు: రక్తం దానం చేయడం వల్ల మరొకరికి ప్రాణం దానం చేసినట్లు అవుతుందని డాక్టర్ రాయుడు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్త దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న 18 నుంచి 65 ఏళ్లలోపు వయస్సు వారు ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.



రక్త దానంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాయుడు

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన తుమ్మలూరు విద్యార్థులతో ఉపాధ్యాయులు



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన వేంపెంట విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాములపాడు: జిల్లా స్థాయి పోటీలకు మండలంలోని తుమ్మలూరు, వేంపెంట విద్యార్థులు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్ఎంలు బాలరాజు, కృష్ణమూర్తి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను శుక్రవారం పాఠశాలల్లో ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. తుమ్మలూరు జెడ్పీహెచ్ స్కూల్ నుంచి అండర్-14, 17 బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బాలికలు ప్రథమ, బాలురు ద్వితీయ స్థానం సాధించారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో 18 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. క్రీడాకారులకు జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి రామలింగేశ్వరరెడ్డి అభినందిస్తూ క్రీడా దుస్తులు పంపిణీ చేసినట్లు హెచ్ఎం బాలరాజు వివరించారు. త్రోబాల్ పోటీలో వేంపెంట జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు డబుల్ క్రౌన్ సాధించినట్లు హెచ్ఎం కృష్ణమూర్తి తెలిపారు.

పల్లకీలో ఆది దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం పల్లకీ సేవ నిర్వహించారు. ఈఓకాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు శరభయ్యశర్మ.. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం చేపట్టారు. గోమాతకు విశేష పూజలు చేసిన అనంతరం పల్లకీ వెంట ఊరేగించారు.



మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

వర్షం..హర్షం



పగిడ్యాల మండలం ఆంజనేయనగర్ పరిధిలోని మొక్కజొన్న పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



కొత్తపల్లి సమీపంలో కళకళలాడుతున్న కంది పైరు

- ఆరుతడిపంటలకు జీవం పోసిన వాన
- కొత్తపల్లి మండలంలో 58.6 మి.మీల వర్షపాతం నమోదు

వాన దేవుడు కరుణించాడు. నందికొట్కూర్ నియోజకవర్గంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. కొత్తపల్లి మండలంలో అత్యధికంగా 58, అత్యల్పంగా పాములపాడులో 6.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పగిడ్యాల మండలంలో 40.6, జూపాడుబంగ్లా మండలంలో 28.8, నందికొట్కూరులో 19.2, మిడుతూరు మండలంలో 16.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. వాడుపట్టిన పైర్లకు ఈ వర్షం జీవం పోషినట్లైందని రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పైర్లకు జీవం

కొత్తపల్లి: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం పడింది. 20 రోజులుగా వర్షం లేక ఆరుతడి పంటలు మొక్కజొన్న, పత్తి, మినుము, సోయాబీన్, పెసర, కంది వంటి పంటలు ఎండుముఖం పట్టాయి. రాత్రి కురిసిన వర్షం పంటలకు జీవం పోసింది. మొక్కజొన్న గింజకట్టే దశ, పత్తి పూత, కాయ దశలో ఎండబెట్ట సోకుతాయన్న దిగులుతో ఉన్న రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, శివపురం, లింగాపురం, గోకవరం, ఎదురుపాడు, కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, గువ్వలకుంట్ల గ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో 58.6 మి.మీల వర్షపాతం నమోదు అయింది. దీంతో పంటకాల్వలలో వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది.

అన్నదాతకు ఊరట..

పగిడ్యాల: దాదాపు నెల రోజులుగా వర్షాభావం నెలకొని వాడుబారుతున్న పంటలకు శుక్రవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షం అన్నదాతలకు ఊరటనిచ్చింది. మండలంలోని నల్లవాగు ఉప్పొంగి లోతట్టు పొలాలు జలమయమయ్యాయి. మొక్కజొన్న పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉండడంతో రైతులు దిగువకు తెంపేందుకు శ్రమించారు. మెట్ట పొలాలు ప్రాణం పోసుకోగా, పాలుపోసే దశలో ఉన్న మొక్కజొన్న పైర్లకు వర్షం ఎంతో మేలు చేసిందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

- జూపాడుబంగ్లా: మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు వర్షం కురిసింది. ఈ వర్షం రబీ పంటలకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు పేర్కొంటున్నారు.
- మిడుతూరు: మండల కేంద్రంతోపాటు పీరుసాహెబ్‌పేట, చెరుకుచెర్ల, వీపనగండ్ల, నాగలూటీ, మాసపేట, చౌట్కూరు, 49-బన్నూరు, తదితర గ్రామాల్లో మోస్తరువర్షం కురిసింది.మండలంలో 16.6 మి.మీల వర్షపాతంనమోదు అయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మోస్తారు వర్షం కురియడంతో కడుమూరు, మాసపేట, చౌట్కూరు, గ్రామాలలో పొగాకు నాట్లు జోరుగా సాగాయి.అదేవిధంగా గతంలో మిరపనాటిన పైరుకు మళ్లీ మిరపనాట్లు వేశారు. దీంతో కూలీలకు,రైతులకు అనువుగా ఉందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- పాములపాడు: మండలంలో 6.02 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వ్యవసాయ బోర్లు, బావుల కింద సాగులో ఉన్న పైర్లకు చివరి తడి నీరు పారించే వారికి ఈ వర్షం ఎంతో ఉపయోగకరమైందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పొంగిపొర్లిన పాలేరు

మహానంది: తెల్లవారు జామున కురిసిన వర్షానికి మహానంది-గాజులపల్లె మార్గంలోని మహానంది వ్యవసాయ కళాశాల సమీపంలో ఉన్న పాలేరు పొంగి ప్రవస్తోంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. మహానంది మండలంలో 52.2 మిల్లీమీటర్ల వర్షపాతం, బండిఆత్మకూరు మండలంలో 29.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



మహానంది మండలంలో పొంగిపొర్లుతున్న పాలేరు